సాక్షి కామారెడ్డి

బుధవారం : 29 : మే : 2024



42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్ చేశారు.

- 8లో ▸



కేవీకేలో స్వర్ణోత్సవాలు

కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా రుద్రూర్‌లోని కేవీకేలో స్వర్ణోత్సవాలు నిర్వహించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
43.4 /26.0

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'కూలీలకు పని కల్పించాలి'

బిచ్కుంద: ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలీకి పనులు కల్పించాల్సిన బాధ్యత ఈజీఎస్ సిబ్బంది, జీపీ కార్యదర్శులపై ఉందని జెడ్పీ సీఈవో చందర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని జీపీలలో కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. రోజు రూ. 300 కూలీ ఇస్తున్నామని అవగాహన కల్పించి పనులకు వచ్చేలా చూడాలన్నారు. వైకుంఠధామంలో నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాల్, ఎంపీవో మహబూబ్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌తో కేంద్ర బృందం భేటీ



కామారెడ్డి క్రైం: కేంద్ర ప్రభుత్వ ఆహార, పౌర సరఫరాల శాఖ ప్రత్యేక బృందం ప్రతినిధులు మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుల పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో సమావేశమయ్యారు. కొనుగోలు కేంద్రాల్లోని పరిస్థితిపై సమీక్షించారు. భిక్కనూరు మండలంలోని జంగంపల్లి, కాచాపూర్, రాజంపేట మండలంలోని తలమడ్ల, బీబీపేట మండలంలోని మాందాపూర్‌లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను కేంద్ర బృందం ప్రతినిధులు పరిశీలించారని అదనపు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ అండ్ పీడీఎస్ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ ఖాన్, టెక్నికల్ ఆఫీసర్ రోబిన్ సింగ్, రాష్ట్ర మార్కెటింగ్ జీఎం భాస్కర్‌రావు, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, ఇన్‌చార్జి డీఎం నిత్యానందం, డీటీలు కిష్టయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

7న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



కామారెడ్డి టౌన్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికలను వచ్చేనెల 7న నిర్వహించనున్నట్లు ప్రస్తుత అధ్యక్షుడు పాత బాలకృష్ణ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 7వ తేదీన ఉదయంనుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎల్లారెడ్డిలోని వైశ్య భవన్‌లో నామినేషన్ల స్వీకరణ, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల పరిశీలన ఉంటాయన్నారు. 8వ తేదీన ఉపసంహరణల తర్వాత బరిలో ఉన్న వారి తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 9వ తేదీన పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు కౌంటింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కైలాస్ శ్రీనివాసరావు, కాంశెట్టి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 2,334 మంది విద్యార్థులకుగాను 2,239 మంది హాజరయ్యారు. నలుగురు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు. ముగ్గురు ఖాళీ ఓఎంఆర్ బార్ కోడ్ షీట్లు ఇచ్చారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 4,183 మంది విద్యార్థులకుగాను 4,030 మంది హాజరయ్యారు. 11 మంది విద్యార్థులు ఖాళీ ఓఎంఆర్ బార్‌కోడ్ షీట్లు ఇచ్చారు. పరీక్షలను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

నేడు నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీ ఎన్నిక

ఎల్లారెడ్డిరూరల్: నాగిరెడ్డిపేట వైస్ ఎంపీపీ ఎన్నికను బుధవారం నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, మాల్తుమ్మెద ఏడీఏ వీరాస్వామి తెలిపారు. వైస్ ఎంపీపీ రాజ్‌దాస్‌పై గత నెల 4న అవిశ్వాస పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ తీర్మానం నెగ్గడంతో ఆయన పదవిని కోల్పోయారు. ఆ స్థానానికి ఎన్నిక నిర్వహించడం కోసం బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

ట్యాపింగ్‌లో కదలిక!

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో జిల్లాలోనూ ప్రకంపనలు వస్తున్నాయి. ప్రతిపక్షాల కదలికలను పసిగట్టి, చెక్ పెట్టడానికి గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఇంటెలిజెన్స్ ఏఎస్పీ భుజంగరావు వాంగ్మూలంలో ఇందుకు సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. దీంతో ట్యాపింగ్‌కు సహకరించిన జిల్లాకు చెందిన అధికారులు, నాయకుల్లో గుబులు మొదలైంది.



కేసులో కీలక పరిణామం

- ఎన్నికల సమయంలో కేవీఆర్, కొండల్‌రెడ్డిల ఫోన్ల ట్యాపింగ్
- ఇంటెలిజెన్స్ ఏఎస్పీ వాంగ్మూలంలో మరిన్ని వివరాలు
- మరికొందరి పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం

కామారెడ్డి క్రైం : అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం కేసీఆర్ తన సొంత నియోజకవర్గం గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలోనూ పోటీ చేశారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇక్కడినుంచి బరిలో నిలిచారు. రేవంత్‌రెడ్డి తరఫున ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి ఎన్నికల ప్రచార బాధ్యతలను చూసుకున్నారు. మరోవైపు బీజేపీ అభ్యర్థిగా కె.వెంకటరమణారెడ్డి పోటీ చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో వెంకటరమణారెడ్డి వైపు ఓటర్ల మొగ్గు ఉన్నట్లు సర్వేల ద్వారా తెలుసుకుని బీజేపీతోపాటు కాంగ్రెస్ లపైనా అప్పటి ప్రభుత్వం నిఘా పెట్టింది. వెంకటరమణారెడ్డి, కొండల్‌రెడ్డిల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించింది. కాగా ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన అప్పటి ఏఎస్పీ భుజంగరావు వాగ్మూలాన్ని సిట్ ఇటీవల రికార్డు చేసింది. బీఆర్‌ఎస్‌ను వరుసగా మూడోసారి అధికారంలోకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ పనిచేసినట్లు ఆయన అంగీకరించడం గమనార్హం. ఆయన కామారెడ్డి నియోజకవర్గంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన వివరాలనూ వెల్లడించినట్లు తెలిసింది.


హోటల్‌లో వార్ రూం..

ప్రత్యర్థుల కదలికలను తెలుసుకునేందుకు ఫోన్ ట్యాపింగ్ గ్యాంగ్‌ను కామారెడ్డికి పంపారని, ప్రతిపక్షాల ఆర్థిక మూలాలను టార్గెట్ చేశారని ప్రాథమిక విచారణలో సిట్ గుర్తించింది. వార్ రూంను ఎక్కడ ఏర్పాటు చేశారు, ఎవరెవరి ఫోన్‌లు ట్యాపింగ్ చేశారు, ఎవరి పాత్ర ఏమిటనే పూర్తి వివరాలను ఇంటెలిజెన్స్ వర్గాలు సేకరించి రెండు నెలల క్రితమే నివేదికను 'సిట్'కు అందించినట్లు తెలిసింది. కాంగ్రెస్, బీజేపీ నేతల వ్యవహారాలపై నిఘా పెట్టడం కోసం కామారెడ్డికి వచ్చిన ట్యాపింగ్ గ్యాంగ్ జిల్లా కేంద్రంలో ఉన్న ఓ ప్రముఖ హోటల్‌లో నాలుగు గదులను అద్దెకు తీసుకున్నట్లు తెలిసింది. అక్కడే వార్ రూంను ఏర్పాటు చేసి తమ కార్యకలాపాలను నడిపించారు. అక్కడి నుంచి ప్రతిపక్ష నాయకుల ఫోన్‌లు ట్యాప్ చేయడం, ఆర్థిక మూలాలు, ఇతర విలువైన సమాచారాన్ని తెలుసుకుని అధికార పక్ష నేతలకు అందించడం లాంటివి చేశారని తెలుస్తోంది. వార్ రూం ఇన్‌చార్జీగా వ్యవహరిస్తూ, ఇక్కడకు వచ్చిన గ్యాంగ్‌కు అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పించిన ముఖ్య నేతలు ఎవరు, ఇక్కడి అధికారులు ఎవరైనా సహకారం అందించారా అన్న విషయాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ వ్యవహారం ఎవరి మెడకు చుట్టుకుంటుందో అని బీఆర్‌ఎస్ నేతలు, వారికి సహకరించిన అధికారులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.

ఆరోపణలకు బలం..

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలకు బలం చేకూరేలా ఎన్నికల సమయంలో పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు మూడు రోజుల ముందు జిల్లా కాంగ్రెస్‌లో ముఖ్య నాయకుడైన గూడెం శ్రీనివాస్‌రెడ్డికి చెందిన వ్యాపార కార్యాలయంపై అధికారులు దాడులు చేశారు. ఇందులో రూ.58 లక్షలు పట్టుబడ్డాయి. దేవునిపల్లి ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి నివాసం ఉన్న ఇంట్లో కూడా ఆకస్మిక తనిఖీలు జరిగాయి. ఆయనను గృహ నిర్బంధం కూడా చేశారు. అంతే కాకుండా విద్యానగర్‌కాలనీలో నివసించే ప్రస్తుత మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియ ఇంటిపై కూడా దాడులు జరిగాయి. ఈ సందర్భంగా పోలీసులు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం కూడా జరిగింది. ఫోన్ ట్యాపింగ్‌తోనే వివరాలు తెలుసుకుని దాడులు చేశారని సిట్ విచారణలో తేలినట్లు సమాచారం.

భానుడి భగభగలు!



జిల్లాలో మంగళవారం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతల వివరాలు..

లొకేషన్	డిగ్రీలు		
బిచ్కుంద	43.4	బొమ్మదేవ్‌పల్లి	41.4
కొల్లూర్	43.2	రామారెడ్డి	41.4
జుక్కల్	43.1	నస్రుల్లాబాద్	41.1
డోంగ్లీ	42.2	పిట్లం	40.8
దోమకొండ	42.1	మక్దుంపూర్	40.7
బీర్కూర్	41.9	పాతరాజంపేట	40.6
హసన్‌పల్లి	41.8	పుల్కల్	40.5
మాచాపూర్	41.5	ఎల్పుగొండ	40.2
		లింగంపేట	40.0

- 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- వేడిగాలులు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న జనం

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. ఇటీవల వాతావరణంలో మార్పులతో గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. అక్కడక్కడ వర్షాలు కురియడంతో ప్రజలు ఎండల తీవ్రతనుంచి కాస్త ఉపశమనం పొందారు. అయితే మళ్లీ నాలుగైదు రోజులుగా ఎండల తీవ్రత పెరుగుతోంది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటాయి. మంగళవారం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత బిచ్కుందలో 43.4 డిగ్రీలుగా నమోదయ్యింది. ఉదయంనుంచే ఎండలు మండుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగటిపూట బయట అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. వడగాలులు వీస్తున్నాయి. మరోవైపు ఇళ్లల్లో ఉక్కపోత ఇబ్బంది పెడుతోంది. ఉక్కపోత, వేడిమి నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను రాత్రింబవళ్లు నడిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

31న బల్దియా వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక

- షెడ్యూల్ జారీ చేసిన ఎన్నికల కమిషన్
- కాంగ్రెస్ అభ్యర్థిగా కౌన్సిలర్ వనితను ప్రకటించిన షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం ఎలక్షన్ కమిషన్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 31న ఎన్నిక నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న గడ్డం ఇందుప్రియ గతనెల 15న చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడంతో ఆ పదవి ఖాళీ అయిన విషయం తెలిసిందే. దీంతో వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చింది. ఈనెల 31వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశించింది. కాగా వైస్ చైర్‌పర్సన్‌గా పదో వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనితను ఎన్నుకుంటామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గతంలోనే ప్రకటించారు. దీంతో ఆమె ఎన్నిక లాంఛనమే అని భావిస్తున్నారు.

గిట్టుబాటు కాదు



ఖద్గాంలో యూనిఫాంలు కుట్టడానికి ఏర్పాటు చేసిన సెంటర్

- యూనిఫాంలు కుట్టడానికి ముందుకు రాని మహిళలు
- జతకు రూ.50 చెల్లిస్తున్న ప్రభుత్వం
- దారాలు, గుండీలు, మెటీరియల్‌కే రూ.30 ఖర్చవుతాయంటున్న టైలర్లు
- జతకు రూ.150 చెల్లించాలని డిమాండ్

బిచ్కుంద : మహిళా సంఘాల్లోని మహిళలకు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం విద్యార్థుల యూనిఫాం కుట్టే పని అప్పగించింది. వాటికి అవసరమైన క్లాత్‌ను మండల కేంద్రాల్లోని ఐకేపీ కార్యాలయాలకు సరఫరా చేసింది. ఒక్కో యూనిఫాం జతకు రూ.50 మాత్రమే చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో తమకు కూలీ గిట్టుబాటు కాదని మహిళలు యూనిఫాంలు కుట్టడానికి ముందుకు రావడం లేదు. గ్రామంలో టైలర్ షాపు పెట్టుకొని ఇంటి పనులు, వ్యవసాయ పనులు చేసుకుంటూ కనీసం రోజుకు రెండు జతలు కుట్టుకుంటే అన్ని ఖర్చులు పోను జతకు రూ.300 మిగులుతుందని మహిళలు అంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న యాభై రూపాయలలో మిషన్‌తో యూనిఫాం కటింగ్ కోసం జతకు రూ.10, గుండీలు, దారం ఇతర ఖర్చులు రూ.20 అవుతుంది. మొత్తం రూ.30 ఖర్చు అయితే జతకు కేవలం రూ.20 మిగులుతుంది. రోజులు ఐదు జతలు కుట్టిన కేవలం వంద రూపాయలు కూలీ పడుతుందని కుట్టడానికి మహిళలు ఎవ్వరు ముందుకు రావడం లేదు. ఒక్కో జతకు రూ.150 చెల్లిస్తే గిట్టుబాటు అవుతుందని మహిళలు అంటున్నారు.



యూనిఫాం డిజైన్లు

మండలానికి చేరని క్లాత్

బిచ్కుంద మండలంలో మొత్తం 4,640 యూనిఫాం జతలు అవసరం ఉన్నాయి. మండలానికి ఇప్పటి వరకు క్లాత్ చేరలేదు. ఆలస్యం అయితే విద్యార్థులకు యూనిఫాంలు అందడం అనుమానంగా ఉంది. పాఠశాలలు జూన్ 12న ప్రారంభం కానున్నాయి. అప్పటి వరకు యూనిఫాం కుట్టించి ఆ యా పాఠశాలలకు పంపాలని ఉన్నతాధికారులు ఐకేపీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఆ దిశగా ఐకేపీ సిబ్బంది అడుగులు వేయడం లేదు. బిచ్కుంద మండలంలో ఖద్గాం, పెద్దదేవాడ, బిచ్కుంద గ్రామాల్లో యూనిఫాంలు కుట్టడానికి సెంటర్లు ఏర్పాటు చేశారు.

గడువులోగా అందించాలి

పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి యూనిఫాంలు అందించాలి. ఇప్పటికే ఐకేపీ సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలి. గడువులోగా యూనిఫాంలు ఇవ్వకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– రాములు నాయక్, ఎంఈవో

కౌంటింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. విధులు కేటాయించిన ప్రతి ఒక్కరూ కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటలలోపు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఈ మేరకు అభ్యర్థులు, వారి తరఫున హాజరయ్యే ఏజెంట్లకు కూడా సమాచారం అందించాలని సూచించారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా చూడాలన్నారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులు మినహా ఇతరులు ఎవరూ కౌంటింగ్ కేంద్రం లోనికి సెల్ ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పంపించాలని ఆదేశించారు. రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించే సమయంలో తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. తుది ఫలితాల వెల్లడి తర్వాత కౌంటింగ్ కేంద్రం వద్ద ఆంక్షలు పక్కాగా అమలయ్యేలా చూడాలని పేర్కొన్నారు. నిబంధనలకు లోబడి సంబురాలు నిర్వహించుకునేందుకు మాత్రమే అనుమతించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి నుంచి కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి ఆర్డీవో రఘునాథరావు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

స్కానింగ్ పేరుతో వీడియోల రికార్డింగ్

- అయ్యప్ప డయాగ్నోస్టిక్స్‌కు నోటీసులు
- మహిళల అశ్లీల వీడియోల చిత్రీకరణపై కలెక్టర్ సీరియస్
- నలుగురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు
- వారంలో నివేదిక ఇవ్వాలని ఆదేశం



నిజామాబాద్‌నాగారం: స్కానింగ్ కోసం వచ్చే మహిళల అశ్లీల వీడియోలను రికార్డు చేస్తున్న ఘటన జిల్లాలో కలకలం రేపుతోంది. స్కానింగ్ సెంటర్‌కు వచ్చే మహిళల ఫొటోలు, వీడియోలు తీసి.. వారికి ఫోన్‌లు చేసి సోషల్ మీడియాలో పెడతానని వేధించడం సంచలనంగా మారింది. సెంటర్‌లోని ఓ ఆపరేటర్ ఈ అకృత్యాలకు పాల్పడడం కలవరం సృష్టిస్తోంది. దీంతో స్కానింగ్ సెంటర్లలో మహిళల భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. నగరంలోని అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో కొంత కాలంగా ఈ తతంగం కొనసాగుతుండడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. అందులో పనిచేసే ఆపరేటర్ ఒక్కరే చేశారా..? వెనుక ఉండి ఎవరైనా చేయించారా అనే అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై సీపీ ఆదేశాల మేరకు పోలీసులు ఇప్పటికే విచారణ చేపట్టారు. తాజాగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సీరియస్‌గా స్పందించి నోటీసులివ్వడంతో పాటు.. విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

జరిగిందిలా..

నిజామాబాద్ నగరంలో పదుల సంఖ్యలో స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. అయితే అయ్యప్ప స్కానింగ్ సెంటర్ ప్రారంభమైన కొన్ని రోజులకే అశ్లీల ఫొటోలు, వీడియోల చిత్రకరణకు తెరలేపారు. ఇందులో పనిచేసే ఓ ఆపరేటర్ స్కానింగ్ కోసం వచ్చిన మహిళల అశ్లీల చిత్రాలను, వీడియోలను గుట్టుచప్పుడు కాకుండా తీసేవాడు. అనంతరం మహిళలకు ఫోన్‌లు చేసి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బెదిరింపులకు పాల్పడడం గమనార్హం. పదుల సంఖ్యలో మహిళలతో ఇలా వికృత చేష్టలకు పాల్పడ్డాడు. ఈ తతంగం కొంత కాలంగా కొనసాగుతోంది. ఈ విషయం స్కానింగ్ సెంటర్‌లో నిర్వాహకులకు, వైద్యులకు తెలిసే జరిగిందని ఆరోపణలున్నాయి. ఓ ఆపరేటర్ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నాడంటే నిర్వాహకులు పసిగట్టలేదంటే నమ్మేటట్లు కనిపించడంలేదు. గతంలోనూ ఇలా చేసినా నిర్వాహకులు తొలగించకపోవడంతోనే మరింత రెచ్చిపోయినట్లు సమాచారం.

ఫిర్యాదుతో వెలుగులోకి..

అయప్ప స్కానింగ్ సెంటర్‌లో మహిళల అశ్లీల చిత్రాలు, వీడియోలు సామాజిక మధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఇందులో తమ ఇంటి మహిళల వీడియో కనిపించడంతో ఓ వ్యక్తి నేరుగా స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి ప్రశ్నించారు. అనంతరం నిజామాబాద్ ఒకటో టౌన్‌లో ఈనెల 7న రాతపూర్వగా ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసులు సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు.

సీపీని కలిసిన ఐఎంఏ నాయకులు

సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో పోలీసులు తనిఖీలు చేసి విచారణ చేపట్టారు. పలుమార్లు స్కానింగ్‌సెంటర్‌లో ఏం జరిగిందో క్షుణ్ణంగా తెలుసుకున్నట్లు సమాచారం. సదరు ఆపరేటర్‌ను సైతం అరెస్ట్ చేశారు. అయితే ఐఎంఏ నాయకులు ఎంటరై నిర్వాహకులకు మద్దతుగా వెళ్లి సీపీని కలిశారు. ఆపరేటర్ తప్పు చేస్తే నిర్వాహకులకు సంబంధం లేదని చెప్పినట్లు సమాచారం. అయితే సీపీ స్పందిస్తూ ఐఎంఏ నాయకులపై మండిపడ్డారు. తప్పు చేసిన వారికి అండగా నిలబడడంపై ఆగ్రహించారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన వార్నింగ్ ఇచ్చారు.

వివరాలు ఇవ్వాలని సీపీ కార్యాలయానికి వైద్యశాఖ లేఖ

సీపీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో విచారణ చేపట్టగా.. ఇందుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈ నెల మొదటి వారంలో విన్నవించారు. కానీ వివరాలు రావడంలో ఆలస్యమైంది. ఎన్నికల కోడ్ కారణంగా సీపీ, అధికారులు బిజీబిజీగా ఉన్నారు. దీంతో వివరాలు ఇంకా శాఖకు రాలేదని వైద్యాధికారి తెలిపారు.

విచారణ తర్వాతే చర్యలు

అయప్ప స్కానింగ్‌లో జరిగిన అశ్లీల వీడియోల చిత్రీకరణపై ఫిర్యాదు వచ్చింది. దీనిపై ఇప్పటికే సీపీ ఆధ్వర్యంలో విచారణ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నలుగురి కమిటీతో విచారణ చేయనున్నారు. విచారణ నివేదిక తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయి.

– డాక్టర్ తుకారాం రాథోడ్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

అటవీభూమి దున్నిన వ్యక్తిపై కేసు



లింగంపేట(ఎల్లారెడ్డి): అక్రమంగా అటవీ భూమిని దున్నిన వ్యక్తిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. అటవీప్రాంతాన్ని దున్నేందుకు ఉపయోగించిన ట్రాక్టర్‌ను సైతం సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు అటవీశాఖ నాగిరెడ్డిపేట రేంజ్ అధికారి వాసుదేవ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు బేస్‌క్యాంపు, స్పెషల్ టీమ్ సిబ్బంది మంగళవారం మండలంలోని కన్నాపూర్ తండాకు చేరుకున్నారు. గ్రామ శివారులోని 688 కంపార్టుమెంటులో అక్రమంగా అటవీ భూమిని దున్నుతున్న శివలాల్‌ను పట్టుకొని కేసు నమోదు చేశారు. శివలాల్ గత కొంతకాలంగా అటవీభూమిని దున్నతున్నట్లు గుర్తించారు. బేస్‌క్యాంపు, స్పెషల్ టీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి, కాచాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్ర ఆహార పౌరసరఫరాల శాఖ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల వివరాలను తెలుసుకున్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లిఖార్జున్‌బాబు, ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్ కిష్టయ్య పాల్గొన్నారు.

స.హ. చట్టంపై శిక్షణ అభినందనీయం



కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్టంపై స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రజలను చైతన్యం చేయడం అభినందనీయమని కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఎస్ ఉమాపతి అన్నారు. స.హ. చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో డెయిరీ టెక్నాలజీ కాలేజీలో సోమవారం ప్రారంభమైన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉమాపతి మాట్లాడుతూ.. అవగాహన, పర్యవేక్షణ లేక స.హ చట్టం నేటికి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. స.హ. చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, డిప్యూటీ డైరెక్టర్ సాహిల్‌ఖాన్ అవగాహన కల్పించారు. ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్, ప్రదీప్‌కుమార్, అజీజ్‌ఖాన్, నూర్జహన్, జమున, కాసర్ల లింగం, రాజేందర్, మాధురి, శ్రీనివాస్‌చారి, నితిన్‌గౌడ్ పాల్గొన్నారు.

నియామకం.. నిర్లక్ష్యం

- వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో పోస్టులు ఖాళీ
- భర్తీ చేయడంలో తాత్సారం చేస్తున్న ప్రభుత్వం
- రోగులకు అందని మెరుగైన వైద్య సేవలు



మోర్తాడ్‌లోని 30 పడకల ఆస్పత్రి

మోర్తాడ్(బాల్కొండ): ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయడంపై దృష్టి సారించకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ నుంచి సామాజిక ఆస్పత్రులను వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసినా అవసరం మేరకు వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. మోర్తాడ్, బాల్కొండ, డిచ్‌పల్లి, ధర్పల్లి, వర్ని, నవీపేట్‌లో 30 పడకల ఆస్పత్రులు ఉండగా, ఆర్మూర్‌లో వంద పడకల ఆస్పత్రి ఉంది. భీమ్‌గల్‌లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కొనసాగుతోంది. 30 పడకల ఆస్పత్రిలో వివిధ రకాల వైద్యం అందించే 14 మంది వైద్యులు, 18 మంది వివిధ హోదాల్లో పని చేసే సిబ్బందిని నియమించాల్సి ఉంది. వంద పడకల ఆస్పత్రిలో 48 మంది వైద్యులు, 73 మంది సిబ్బంది పోస్టులను ఖరారు చేశారు. భీమ్‌గల్ ఆస్పత్రి నిర్మాణం ఇంకా పూర్తిగాకపోవడంతో మిగిలిన ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. జిల్లాలో మొత్తం 132 మంది వైద్యులు, 181 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఇప్పటి వరకు పోస్టుల భర్తీపై దృష్టి సారించకపోవడంతో నోటిఫికేషన్ జారీతోనే సరిపెట్టారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోకి ఆస్పత్రులను చేర్చడంతో వైద్య సేవలు ఎంతో మెరుగవుతాయని అందరూ భావించారు. పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలుపడంలో జాప్యం కావడంతో పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని, వైద్యులను డిప్యుటేషన్ పద్ధతిపై కమ్యూనిటీ ఆస్పత్రుల్లో కొనసాగిస్తున్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోకి ఆస్పత్రులు విలీనం కావడంతో వైద్య సేవలు విస్తృతమవుతాయని భావించిన వారికి నిరాశే మిగిలింది.

గర్భిణులకు అందని సేవలు

ఆర్మూర్, బోధన్, నిజామాబాద్‌లోని ఆస్పత్రుల్లో మినహా ఇతర సామాజిక వైద్యశాలల్లో గర్భిణులకు ప్రసవ సేవలు అందడం లేదు. సాధారణ ప్రసవం చేసే అవకాశం లేకపోతే శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుంది. సర్జన్‌లు, గైనకాలజిస్టులు లేకపోవడంతో శస్త్రచికిత్స ప్రసవ సేవలను పూర్తిగా నిలిపివేశారు. గర్భిణులను ప్రసవం కోసం మోర్తాడ్ ప్రాంతం నుంచి మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించాల్సి వస్తోంది. ఆర్మూర్‌లో నిర్ణీత సంఖ్యలోనే ప్రసవ సేవలు అందిస్తుండటంతో పొరుగు జిల్లా ఆస్పత్రిని ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రసవ సేవలతోపాటు ఇతర వైద్య సేవలను విస్తృత పర్చాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే భర్తీ కావొచ్చు

సామాజిక ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకాలు త్వరలోనే పూర్తి కావొచ్చు. గతంలో నోటిఫికేషన్ జారీ చేశాం. మరోసారి నోటిఫికేషన్ ఇచ్చి పోస్టుల భర్తీ కోసం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతాం.

– డాక్టర్ శివశంకర్, వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి

ఘనంగా కేవీకే స్వర్ణోత్సవాలు



గోల్డెన్ జూబ్లీ టార్చ్‌ను ప్రదర్శిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి బాలాజీనాయక్

రుద్రూర్: దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రుద్రూర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్డెన్ జూబ్లీ టార్చ్‌ను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీకే అధిపతి బాలాజీనాయక్ మాట్లాడుతూ.. కృషి విజ్ఞాన కేంద్రాలు రైతులకు అవసరమైన సేవలందించడంతోపాటు ఆధునిక వ్యవసాయ సాంకేతికను విస్తరింపజేస్తున్నాయని అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో పరిజ్ఞానాన్ని అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడంలో కేవీకేలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. కేవీకేల్లో శాస్త్రవేత్తలు రూపొందించిన నూతన వంగడాలను రైతులకు పరిచయం చేయడం, అధిక దిగుబడులు సాధించడానికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, వివిధ మాధ్యమాల ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నాయన్నారు. కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ కల్పన, ఆత్మ బీటీఎం భరత్ కుమార్, కోటగిరి ఏవో శ్రీనివాస్‌రావు, కేవీకే శాస్త్రవేత్తలు బీవీ రాజ్‌కుమార్, పి విజయ్‌కుమార్, ఎం శ్వేత, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు 444 మంది గైర్హాజరు



పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చంద్రశేఖర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు మొత్తం 444 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ పరిధిలో 38 కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7,042 మందికిగాను 6,697 మంది హాజరు కాగా 344 మంది గైర్హాజరయ్యారని, అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ఒకటో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 1,722 మంది విద్యార్థులకు గాను 1,622 మంది హాజరు కాగా 100 మంది గైర్హాజరైనట్లు వివరించారు. నిజామాబాద్‌లోని గౌతమి డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారన్నారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతీక్ సుల్తాన్ ఘోరీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. వివిధ రూట్లలో నాలుగు ప్రత్యేక స్క్వాడ్ బృందాలు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించాయి.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్

కామారెడ్డి టౌన్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వరలక్ష్మిగార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. సామాజిక న్యాయం పాటిస్తామని కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. కులగణన చేపట్టాలని జూన్ 8న చలో ఇందిరా పార్క్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అయినా స్పందించకుంటే జూన్ 15న సెక్రెటరియేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. జేఏసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అర్కల ప్రభాకర్‌యాదవ్, ఆరె కటికె జిల్లా అధ్యక్షులు బాలాజీ, నర్సాగౌడ్, రమేశ్, కాపర్తి నాగరాజు, కాకర్ల ప్రభాకర్, వేణు, ఆనంద్, మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిరికొండలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు



తొర్తి ఉన్నత పాఠశాలలో..



మాక్లూర్ ఉన్నత పాఠశాలలో..

మోర్తాడ్/సిరికొండ/మాక్లూర్: ఏర్గట్ల మండలం తొర్తి, మాక్లూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో, సిరికొండ మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. తొర్తిలో 2009–10 బ్యాచ్, సిరికొండలో 2013–14 బ్యాచ్, మాక్లూర్‌లో 2002–2003 విద్యార్థుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలను ఉత్సాహంగా నిర్వహించారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

క్రైం కార్నర్

నంబర్‌ప్లేట్ లేని వాహనాలు సీజ్

మోపాల్: నంబర్ ప్లేట్ లేని రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా



రుద్రూర్: మండలంలోని సులేమాన్ నగర్ శివారులో గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. ట్యాంకర్ అదుపుతప్పి బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

యువతి అదృశ్యం

బాల్కొండ: మండలంలోని శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై గోపి మంగళవారం తెలిపారు. టైలరింగ్ నేర్చుకునేందుకు ఆర్మూర్‌లోని సాహితీ ఇన్‌స్టిట్యూట్‌కు సోమవారం వెళ్లిన యువతి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మత్స్యకారులపై ఫిర్యాదు

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్ గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తిపై మత్స్యకారులు దాడి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామ శివారులోని బతుకమ్మ చెరువులో ధర్మారం గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపలు వేటాడుతుండగా ఇప్పుడే వద్దన్నందుకు తనపై దాడి చేశారని రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ధర్మారం గ్రామానికి చెందిన సుండు నర్సయ్య, సుండు కిషన్, అంబం చిన్నలక్ష్మణ్, బి నర్సయ్య, యాదగిరి, నాగయ్య, భూమయ్య తనపై దాడి చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బైక్‌ను ఢీకొన్న జేసీబీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మహిళా ప్రాంగణం సమీపంలో సోమవారం రాత్రి జాతీయ రహదారి నంబర్ 44పై ఓ బైక్‌ను రాంగ్‌రూట్‌లో వచ్చిన జేసీబీ ఢీకొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన భార్యాభర్తలు ఆర్మూర్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన జేసీబీ బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో తన భర్తకు తీవ్రగాయాలైనట్లు వేంపల్లికి చెందిన పద్మావతి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసింది. నిర్లక్ష్యంగా జేసీబీ నడిపిన డ్రైవర్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరింది.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిపై పలువురు దాడి చేయడంతో అతడు మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన అలీ హుస్సేన్ (40) అదే జిల్లాకు చెందిన భార్య చంద్రి నిర్మలను 15 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన అలీ హుస్సేన్ తరచూ కొడుతుండడంతో చంద్రి నిర్మల తన తల్లివద్దకు వెళ్లిపోయింది. బతుకుదెరువు కోసం హుస్సేన్ నిజామాబాద్‌కు వచ్చి స్థానిక మహిళతో సహజీవనం చేస్తూ ఇక్కడే ఉంటున్నాడు. తాను సహజీవనం చేస్తున్న మహిళ బంధువు అయిన మరో మహిళతో అలీ హుస్సేన్ ఆదివారం అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత మహిళతోపాటు ఆమె భర్త, బంధువులు దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హుస్సేన్‌ను జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై గణేశ్

దోమకొండ: తండ్రి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో మండల కేంద్రానికి చెందిన రావులపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి (25) అనే యువకుడు మంగళవారం గ్రామ శివారులోని గుండ్ల చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. విష్ణువర్ధన్‌రెడ్డి ఏ పనీ చేయకుండా డబ్బుల కోసం తరచూ తండ్రితో గొడవపడేవాడు. ఈ మధ్య బైక్ కొనుగోలు చేశాడు. మంగళవారం సైతం డబ్బులు ఇవ్వాలని తండ్రిని కోరగా, అతడు నిరాకరించాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి బయటికి వచ్చిన విష్ణువర్ధన్‌రెడ్డి తన స్నేహితుడు రాకేశ్‌కు ఫోన్ చేసి తాను చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. రాకేశ్ వెంటనే విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి నరేందర్‌రెడ్డికి విషయం తెలుపగా.. వెంటనే చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా..



ప్రశాంత్ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొర్పోల్ గ్రామానికి చెందిన ప్రశాంత్(25)ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆటో నడుపుతూ జీవించే ప్రశాంత్, గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడని, ఈ క్రమంలో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని నీటి మడుగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పులు చెల్లించలేక మెప్మా ఆర్‌పీ..



భీమ్‌గల్: పేదరిక నిర్మూలన సంస్థలో ఆర్‌పీగా విధులు నిర్వర్తిస్తున్న ప్రహ్లాది వాసంతి(35) అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వాసంతి గతంలో మహిళా స్వయంసహాయక సంఘం నుంచి రుణాలు తీసుకుంది. ఆ రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో స్వయం సహాయక సంఘాల వారు రుణాన్ని చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో ఆమె అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. తన చావుకు ఎవరు కారణం కాదని, అప్పులు చెల్లించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ నోట్ రాసి పెట్టినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం



పంచనామా నిర్వహిస్తున్న తహసీల్దార్ గజానన్

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్‌లో రియల్టర్ల కబ్జా నుంచి ప్రభుత్వ భూమిని అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కొటార్మూర్ పరిధిలోని 31 సర్వే నంబర్‌లో రూ.రెండు కోట్ల విలువైన 1,089 గజాల ప్రభుత్వ స్థలాన్ని రియల్టర్లు తమ వెంచర్‌లో కలుపుకోవడానికి ప్రయత్నించారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గజానన్, ఆర్ఐ అశోక్‌సింగ్, సర్వేయర్ శికారి రాజు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రవీణ్ సంయుక్తంగా సర్వే చేపట్టారు. ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. నివేదికను కలెక్టర్, ఆర్డీవోకు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

తప్పిన ప్రమాదం



ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో వెనుక నుంచి పొగలు రావడంతో రోడ్డు పక్కన నిలిపివేసి ప్రయాణికులను కిందికి దింపారు. నిజామాబాద్–2 డిపోకు చెందిన బస్సు ఆర్మూర్ మీదుగా నిర్మల్‌కు వెళ్తుండగా సిద్ధులగుట్ట సమీపంలో బస్సు వెనుక భాగం నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు విషయాన్ని డ్రైవర్‌కు తెలుపగా ఆయన బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. బస్సులో ఉన్న 82 మంది ప్రయాణికులను కిందికి దింపి వేరే బస్సులో పంపించారు. ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, రైలులో నుంచి జారిపడి ఒకరు, చెరువులో మునిగి మరొకరు, కూలీ పనులు చేస్తూ ఇంకొకరు మృతి చెందారు. ఆయా ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

రోడ్డు ప్రమాదంలో..



చాట్ల నర్సయ్య(ఫైల్)

నవీపేట: మండలంలోని నారాయణ్‌పూర్ శివారులో సైకిల్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో జన్నేపల్లికి చెందిన చాట్ల నర్సయ్య(46) మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. పొల్దా శివారులోని రైస్‌మిల్లులో కూలీగా పనిచేసే నర్సయ్య రోజూలాగే మంగళవారం జన్నేపల్లి నుంచి సైకిల్‌పై వెళ్తుండగా వేగంగా దూసుకు వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలులో నుంచి జారి పడి..

ఖలీల్‌వాడి: రైలులో నుంచి జారిపడి ప్రకాశం జిల్లాకు చెందిన యువకుడు మృతి చెందాడు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పొదిలి మండలం కంబాలపాడు గ్రామానికి చెందిన రవి(29) నిజామాబాద్‌లో కూలీ పనులు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్తుండగా ఇందల్వాయి – సిర్నాపల్లి స్టేషన్ల మధ్యలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెందాడు. మృతదేహాన్ని నిజామాబాద్‌జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెరువులో మునిగి..

మాక్లూర్: ప్రమాదవశాత్తు చెరువులో మునిగి జ్వాల దుర్గయ్య(65) అనే పశువుల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రాంచంద్రాపల్లి శివారులోని సింగసముద్రం చెరువులో జరిగింది. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

సంగారెడ్డి జిల్లా నిజాంపేటకు చెందిన దుర్గయ్య బతుకుదెరువుకోసం గత సంవత్సరం తన భార్య దుర్గమ్మతో కలిసి రాంచంద్రాపల్లికి వచ్చి పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. రోజూలాగే సోమవారం పశువులను మేతకోసం తీసుకెళ్లాడు. పశువులు సింగసముద్రం చెరువులోకి దిగడంతో వాటిని బయటికి కొట్టేక్రమంలో నీటిలో మునిగి మృతి చెందాడు. మొరం కోసం తవ్విన గుంతలో మునిగిపోగా సోమవారం రాత్రి కావడంతో గాలింపు చర్యలు చేపట్టలేదు. మంగళవారం ఉదయం దుర్గయ్య మృతదేహం నీటిపై తేలడంతో పోలీసులు బయటికి తీయించి పంచనామా చేశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధి పనులు చేస్తుండగా కూలీ..



పెద్ద మల్లయ్య(ఫైల్)

భిక్కనూరు: ఉపాధిహామీ పనులు చేస్తూ అకస్మాత్తుగా కూలీ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన అంబల్ల పెద్దమల్లయ్య(66) రోజూలాగే మంగళవారం ఉపాధి హామీ పనికి వెళ్లాడు. పని చేస్తుండగానే పెద్ద మల్లయ్య కుప్పకూలడంతో తోటి కూలీలు, కుటుంబ సభ్యులు ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కామారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పెద్దమల్లయ్య కుమారుడు గతేడాది గుండెపోటుతో మృతి చెందాడు. భిక్కనూరు వ్యవసాయ మార్కెట్‌లో పెద్దమల్లయ్య తొలికూలీగా పని చేశాడు.